సమాచార విభాగం, కేంద్రీయ కార్యాలయము
ఎస్ .బి .ఎస్ మార్గ్, ముంబాయి-400001
ఫోన్ :91 22 2266 0502/ ఫ్యాక్స్ :91 22 2266 0358

భారతీయ రిజర్వు బ్యాంకు
RESERVE BANK OF INDIA
www.rbi.org.in

తేదీ : 18.06.2021

**ద్రవ్య విధాన సమితి సమావేశం – జూన్ 2-4, 2021, వ్యవహార సంగ్రహము (మినిట్స్)**
**[రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934, సెక్షన్ 45ZL క్రింద]**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934, సెక్షన్ 45ZB క్రింద నెలకొల్పబడిన ద్రవ్య విధాన సమితి (మానిటరీ పాలిసీ కమిటీ, ఎమ్ పి సి) ఇరవై తొమ్మిదవ సమావేశం, జూన్ 2 నుండి 4 వరకు జరిగింది.

2. గవర్నర్ శ్రీ శక్తి కాంత దాస్ అధ్యక్షతలో, జరిగిన ఈ సమావేశంలో అందరూ సభ్యులూ - డా. శశాంక భిడే, ఉన్నత సలహాదారు, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్, ఢిల్లీ; డా. అషిమా గోయల్, ప్రొఫెసర్, ఇందిరా గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెవెలప్మెంట్ రీసెర్చ్, ముంబై; ప్రొఫెసర్ జయంత్ ఆర్ వర్మ, ప్రొఫెసర్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మానేజ్మెంట్, అహమ్మదాబాద్; డా. మృదుల్ కె సగ్గర్, ఎక్జెక్యూటివ్ డైరెక్టర్ (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934, సెక్షన్ 45 ZB (2) (c) క్రింద, సెంట్రల్ బోర్డ్ చే నియమించబడ్డ రిజర్వ్ బ్యాంక్ అధికారి); డా. మైకేల్ దేబబ్రత పాత్రా, ద్రవ్య విధాన ముఖ్య అధికారిగా ఉన్న డిప్యూటీ గవర్నర్ - పాల్గొన్నారు. డా. శశాంక భిడే, డా. అషిమా గోయల్ మరియు ప్రొఫెసర్ జయంత్ ఆర్ వర్మ, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

3. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934, సెక్షన్ 45ZL అనుసారం, ద్రవ్య విధాన కమిటీ సమావేశం జరిగిన 14 వ రోజున, ఈ క్రింది అంశాలతో కూడిన 'వ్యవహార సంగ్రహం (మినిట్స్)', ప్రచురించాలి.

a. సమావేశంలో, ద్రవ్య విధాన సమితి ఆమోదించిన తీర్మానాలు;
b. ద్రవ్య విధాన సమితి సమావేశంలో ఆమోదించిన తీర్మానంపై, ప్రతి సభ్యునియొక్క వోట్; మరియు
c. సెక్షన్ 45ZL సబ్-సెక్షన్ (11) క్రింద, ద్రవ్య విధాన సమితి సమావేశంలో ఆమోదించిన తీర్మానంపై, ప్రతి సభ్యునియొక్క వివరణము.

4. వివియోగదారుల విశ్వాసాన్ని అంచనావేయుటకు రిజర్వ్ బ్యాంక్ జరిపిన సర్వే; ద్రవ్యోల్బణం మీద కుటుంబాల అంచనాలు; కార్పొరేట్ రంగ పనితీరు; పరపతి లభ్యత; పారిశ్రామిక / సేవా / మౌలిక రంగాల గురించిన దృక్పథం; భావి పరిస్థితులపై, ఈ రంగంలోని నిష్ణాతుల అభిప్రాయాలు, అన్నిటినీ ఎమ్ పి సి సమీక్షించింది. ఇంతేగాక, ఉద్యోగులు చేసిన స్థూల ఆర్థిక అంచనాలు, వాటిని ప్రభావితంచేసే వివిధ పరిస్థితులు, కూలంకషంగా చర్చించి, ఈ క్రింది తీర్మానాన్ని, ఎమ్ పి సి ఆమోదించింది.

### తీర్మానము

5. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, రాబోయే పరిణామాలపై చేసిన అంచనాల ఆధారంగా, ఈ రోజు జరిగిన (జూన్ 4,2021) సమావేశంలో, ఎమ్ పి సి ఈ విధంగా నిర్ణయించింది:

- ద్రవ్యత సవరింపు సౌకర్యం క్రింద (లిక్విడిటీ అడ్జస్ట్మెంట్ ఫెసిలిటీ, ఎల్ ఏ ఎఫ్) పాలసీ 'రెపో రేట్', ఎట్టి మార్పు లేకుండా 4.0 శాతంగానే ఉంచవలెను.

ఇందువల్ల, ఎల్ ఏ ఎఫ్ క్రింద 'రివర్స్ రెపో రేట్' మార్పులేకుండా 3.35 శాతంగా; మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎమ్ ఎస్ ఎఫ్) రేట్ మరియు బ్యాంక్ రేట్లు, మార్పులేకుండా 4.25 శాతంగా కొనసాగుతాయి.

- ద్రవ్యోల్బణం లక్ష్యాన్ని మించకుండా జాగ్రత్త వహిస్తూ, ఆర్థిక వ్యవస్థపై కోవిడ్-19 ప్రభావాన్ని ఉపశమింపచేస్తూ, దీర్ఘకాల అభివృద్ధిని పునరుద్ధరించుటకొరకు, అవసరమయినంత కాలం, సానుకూల ధోరణితో వ్యవహరించాలని ఎమ్ పి సి నిర్ణయించింది.

అభివృద్ధికి ఊతమిస్తూ, వినియోగదారుల ధరల సూచిలో (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్, సి పి ఐ) మధ్యకాలీన ద్రవ్యోల్బణ లక్ష్యం 4 శాతం (+/- 2 శాతం పరిమితిలో)

సాధించాలి అన్న ఉద్దేశానికి అనుగుణ్యంగా ఈ నిర్ణయాలు తీసికోవడం జరిగింది.

ఈ నిర్ణయాలకు ఆధారభూతమైన ముఖ్య కారణాలు, ఈ క్రింది నివేదికలో వివరించబడ్డాయి.

**అంచనా**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

6. ఏప్రిల్ లో జరిగిన క్రిందటి ఎం పి సి సమావేశం తరువాత, ముఖ్యంగా, అభివృద్ధి చెందిన దేశాల (ఏ ఇ, అడ్వాన్స్‌డ్ ఎకానమీస్) ప్రేరణతో మరియు పెద్ద ఎత్తున చేపట్టిన టీకా కార్యక్రమాలు, ఉద్దీపనల కారణంగా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకొంటోంది. ప్రధాన ఎమార్జింగ్ మార్కెట్ ఎకానమీస్‌లో, (ఇ ఎం ఇ) లలో, ఉత్పరివర్తన (మ్యుటేషన్) చెందిన వైరస్ మళ్ళీ విజృంభిస్తున్న కారణంగా మరియు టీకా కార్యక్రమం మందకొడిగా సాగడంచేత, ఆర్థిక కార్యకలాపాలు ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. విదేశీ గిరాకీ పెరిగిన కారణంగా, ప్రపంచవ్యాప్తంగా వస్తు వాణిజ్యం కోలుకొంటోంది. అయితే, పెరిగిన రవాణా ఖర్చులు, కంటైనర్ల లభ్యతలోగల సమస్యలు, అడ్డంకులుగా నిలుస్తున్నాయి. అనేక ఏ ఇ లలో, ప్రోగుపడ్డ గిరాకీ ఒక్కసారి విడుదల కావడం, తయారీ ఖర్చులు పెరగడం, మూలాలలో ప్రతికూల ప్రభావంవల్ల (ఆన్‌ఫేవరబుల్ బేస్ ఎఫెక్ట్) కారణంగా, వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం (సి పి ఐ ఇన్‌ఫ్లేషన్) పెరుగుతోంది. ఆహార మరియు వస్తువుల ధరలు క్రమేపీ పెరుగుతున్న కారణంగా, ముఖ్యమైన ఇ ఎమ్ ఇ లలో, ఇటీవలి నెలలలో ద్రవ్యోల్బణం అధికారిక లక్ష్యాలకు దగ్గరగా లేదా అంతకుమించి ఉంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు సానుకూలంగానే ఉన్నాయి.

దేశీయ ఆర్థిక పరిస్థితి

7. దేశ ఆర్థిక పరిస్థితి విషయానికొస్తే, జాతీయ గణాంక కార్యాలయం (నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్) మే 31, 2021 తేదీన విడుదలచేసిన తాత్కాలిక అంచనాల ప్రకారం, వాస్తవ స్థూల జాతీయ ఉత్పత్తి (రియల్ జి డి పి) 2020-21 సంవత్సరంలో 7.3 శాతం సంకోచించింది. కానీ, నాలుగో త్రైమాసికంలో జి డి పి, క్రితం

సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే (ఈయర్ ఆన్ ఈయర్, వై-ఓ-వై) 1.6 శాతం పెరిగింది. జూన్ 1 తేదీన భారత వాతావరణ సంస్థ, నైరుతి ఋతు పవనాలు సాధారణంగాఉండి, దీర్ఘకాలిక సగటు కన్నా 101 శాతం వర్షాలు పడతాయని, సూచించింది. వ్యవసాయానికి ఇది శుభసూచకం. అయితే, గ్రామీణ ప్రాంతాల్లో, కోవిడ్ వ్యాధి ప్రబలడంవల్ల, గ్రామీణ గిరాకీని సూచించే ట్రాక్టర్ అమ్మకాలు, ద్విచక్ర వాహనాల అమ్మకాలు, వరుసగా ఏప్రిల్ నెలలోకూడా తగ్గాయి.

8. పారిశ్రామిక ఉత్పత్తి, స్థూలంగా చూస్తే మార్చి 2021 లో మెరుగయింది. గనుల, విద్యుచ్ఛక్తి ఉత్పాదన మార్చి 2019 కన్నా (మహమ్మారికి ముందు) అధికమయినా, తయారీ రంగం వెనుకబడే ఉంది. కీలక పరిశ్రమల ఉత్పాదన, ఏప్రిల్ 2021 లో (వై-ఓ-వై) రెండంకెల అభివృద్ధి సాధించింది (నిరుటి సంవత్సరం బలహీనమైన ఉత్పాదనతో పోలిస్తే). వస్తు సేవల పన్ను (జి ఎస్ టి) వసూళ్లు, ఏప్రిల్ 2021 లో అత్యధికమైనా, ఈ-వే బిల్స్ తగ్గడం, మే నెలలో వసూళ్లు తగ్గవచ్చని సూచిస్తోంది. ఇతర హై ఫ్రీక్వెన్సీ సూచికలు:- విద్యుదుత్పత్తి; రైల్వే రవాణా; ఓడ రవాణా; ఉక్కు వినియోగం; సిమెంట్ ఉత్పత్తి; దారి సుంకం వసూళ్లు (టోల్), ఏప్రిల్-మే 2021 లో వరసగా తగ్గుతూ వచ్చాయి. వివిధ రాష్ట్రాలు, విధించిన నిర్బంధనలు (ప్రత్యేక కార్యకలాపాలకు మినహాయింపుతో), కొన్ని ప్రాంతాలలో లాక్ డౌన్లు దీనికి కారణం. మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మానేజర్స్ ఇండెక్స్ (పి ఎమ్ ఐ), ఏప్రిల్ నెలలో ఉత్పాదన నెమ్మదించడం, కొత్త ఆర్డర్లు లేకపోవడం వల్ల, 55.5 నుంచి 50.8 కి తగ్గినాగాని, మే నెలలో పెరుగుతూ ఉంది. సేవల పి ఎమ్ ఐ, ఏప్రిల్ నెలలో 54.0 నుంచి, మే నెలలో 46.4 కి తగ్గింది (ఏడు నెలలు పెరిగిన తరువాత).

9. మూలాలు అనుకూలంగా ఉన్న కారణంగా, మార్చ్ నెలలో 5.5 శాతంగా ఉన్న ‘హెడ్ లైన్ ఇన్ఫ్లేషన్’, ఏప్రిల్ నెలలో 4.3 శాతానికి తగ్గింది. పప్పులు, కూరగాయలు, పంచదార ధరలు గత సంవత్సరంతో పోలిస్తే తగ్గుముఖం పడుతూ ఉండడంవల్ల, మార్చిలో 5.2 శాతం ఉన్న ఆహార ద్రవ్యోల్బణం ఏప్రిల్ లో 2.7 శాతానికి పడిపోయింది. ఇంధన ద్రవ్యోల్బణం దూసుకుపోయినా, ‘కోర్ ద్రవ్యోల్బణం’ (అనగా వినియోగదారుల ద్రవ్యోల్బణం నుంచి, ఆహారం, ఇంధనం మినహాయించి), ఏప్రిల్ నెలలో అన్ని ఉప వర్గాలలో (గృహ నిర్మాణం, ఆరోగ్యం తప్ప) మూలాలు బాగున్న కారణంగా, తగ్గుదల చూపింది. అయితే, రవాణా, సమాచార రంగాలలో ద్రవ్యోల్బణం రెండంకెలలో కొనసాగుతోంది.

10, వ్యవస్థలో ద్రవ్యత ఏప్రిల్, మే 2021 నెలలలో చాలా అధికంగా ఉంది. లిక్విడిటీ అడ్జస్ట్ మెంట్ ఫెసిలిటీ (ఎల్ ఏ ఏఫ్) క్రింద, సగటు రోజువారీ గ్రహించిన ద్రవ్యత రూ. 5.2 లక్షల కోట్లు. కరెన్సీ గిరాకీ అధికమయిన కారణంగా, మే 28, 2021 తేదీన, గత సంవత్సరంతో పోల్చినప్పుడు, రిజర్వ్ మనీ (నగదు నిల్వల నిష్పత్తి మారిన కారణంగా, మొదటి దఫా కలిగే తాకిడికి సర్దుబాటుచేసిన తరువాత) 12.4 శాతం పెరిగింది. క్రిందటి సంవత్సరం వరుసగా 11.7, 6.2 శాతం పెరిగిన ద్రవ్య సరఫరా (M3), మరియు బ్యాంక్ రుణాలు మే 21, 2021 తేదీన వరుసగా 9.9, 6.0 శాతం పెరిగాయి. విదేశీ మారక నిల్వలు 2021-22 లో (మే 28 వరకు) US $ 21.2 బిలియన్లు పెరిగి, US $ 598.2 బిలియన్లు చేరుకొన్నాయి.

**దృక్పథం**

11. రానున్న కాలంలో ద్రవ్యోల్బణం హెచ్చు తగ్గులు, అనిశ్చిత పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. ప్రత్యేకించి, అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు, రవాణా ఖర్చులు, ద్రవ్యోల్బణాన్ని పైకి నెట్టే ప్రమాదం ఉంది. పెట్రోల్, డీసెల్ ధరల పెరుగుదలవల్ల, పెరిగే ఉత్పాదక వ్యయం నియంత్రించడానికి, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు విధించే ఎక్సయిస్, సెస్, పన్నులు సమన్వయంతో సర్దుబాటు చేయాలి. నైరుతి ఋతుపవనాలు, సాధారణంగా ఉండటం, ఆహారనిల్వలు సంతృప్తికరంగా ఉండటం, పప్పు ధాన్యాల ధరలు స్థిరంగా ఉండటానికి తోడ్పడతాయి. ఇటీవల తీసికొన్న చర్యలు, కాయధాన్యాల సరఫరాలో ఇబ్బందులని తగ్గిస్తాయి. పప్పుధాన్యాలు, వంట చమురు ధరలు తగ్గాలంటే, వాటి సరఫరాలోగల సమస్యలు చక్కదిద్దుటకు మరి కొన్ని చర్యలు అవసరం. మహమ్మారి తగ్గడంతో ప్రాంతీయంగా విధించిన నిర్బంధాలు, లాక్ డౌన్లు క్రమేపీ సడలించబడి, సరఫరాలోగల అంతరాయాలు తొలగి, ధరలు తగ్గుతాయి. గిరాకీ తగ్గడం కారణంగాకూడా, 'కోర్ ఇన్ఫ్లేషన్' మితం కావచ్చు. పై అంశాలు పరిగణనలోకి తీసికొని, వినియోగదారుల ధరల సూచీ 2021-22 సంవత్సరంలో 5.1 శాతం ఉండవచ్చని అంచనా - మొదటి త్రైమాసికంలో, 5.2 శాతం; రెండవ త్రైమాసికం, 5.4 శాతం; మూడవ త్రైమాసికం, 4.7 శాతం ; నాలుగవ త్రైమాసికం, 5.3 శాతం. (చార్టు 1)

12. అభివృద్ధి విషయానికి వస్తే, గ్రామీణ గిరాకీ బలంగా ఉంది. వర్షపాతం సాధారణంగా ఉంటుందన్న అంచనావల్ల, ఇకపై కూడా ఇది ఇలాగే కొనసాగుతుంది. కాని, అనేక గ్రామీణ ప్రాంతాలలో కోవిడ్ 19 పెరుగుతున్న కారణంగా గిరాకీ పడిపోవచ్చు. రెండో దశ కోవిడ్ ఉధృతి కారణంగా, పట్టణాలలో గిరాకీ దెబ్బతింది. వాణిజ్య సంస్థలు, కోవిడ్ సోకకుండా పని తీరును మార్చకొన్నందువల్ల, ఆర్థిక వ్యవస్థపై అంతగా ప్రభావం లేకపోవచ్చు, ప్రత్యేకించి ప్రత్యక్ష సంపర్కం అవసరంలేని తయారీ / సేవా రంగాలలో. మరో వైపు, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ కోలుకొంటున్నందువల్ల, ఎగుమతులు ఊపందుకోవచ్చు. ఇంతేగాక, రాబోయే నెలలలో, టీకా కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతుందిగనుక, ఆర్థిక వ్యవస్థ త్వరలో సాధారణ స్థితికి వస్తుంది. ఈ విషయాలన్నీ లెక్కలోకి తీసికొని, వాస్తవ స్థూల జాతీయ (రియల్ జి డి పి) ఉత్పత్తిలో అభివృద్ధి 2021-22 సంవత్సరానికి, 9.5 శాతంగా అంచనా వేయబడింది (మొదటి త్రైమాసికం-18.5 శాతం; రెండవ త్రైమాసికం - 7.9 శాతం; మూడవ త్రైమాసికం-7.2 శాతం; నాల్గవ త్రైమాసికం-6.6 శాతం). (చార్ట్ 2)




Chart 1: Quarterly Projection of CPI Inflation (y-o-y)




Chart 2: Quarterly Projection of Real GDP Growth (y-o-y)

13. కోవిడ్-19 రెండో దశ, సమీపకాల అంచనాలను తలక్రిందులు చేసిందని ఎమ్ పి సి గ్రహించింది. ఈ పరిస్థితిలో, సరఫరాలో ఇబ్బందులు తలెత్తి, రిటైల్ మార్జిన్లు పెరగకుండా చూడాలంటే, విధానాలలో తక్షణ మార్పు, క్రియాత్మక పర్యవేక్షణ, సకాల

చర్యలు అవసరం. ప్రజల ప్రాణాలు, జీవనోపాధులు కాపాడడానికి, కొత్త రకాల కోవిడ్ వ్యాప్తి అరికట్టడానికి, టీకా కార్యక్రమాల వేగాన్ని పెంచడం, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మౌలిక ఆరోగ్య వ్యవస్థ బలోపేతం చేయడం, కీలకం. ఈ సమయంలో, ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించి తిరిగి సాధారణ స్థితికి తేవడానికి, అన్ని వైపులనుండి- ద్రవ్య, ఆర్థిక, వర్గ సహకార, విధానాలు అవసరం. తదనుసారంగా, ఎమ్ పి సి, ప్రస్తుత రెపో రేట్ 4 శాతాన్ని మార్పులేకుండా ఉంచి, ఆర్థిక వ్యవస్థ స్థిరంగా పుంజుకొనేవరకు, సానునయ విధానాన్ని అనుసరిస్తూ, వచ్చే కాలంలో ద్రవ్యోల్బణ లక్ష్యం పెరగకుండా, కోవిడ్-19 ప్రభావాన్ని ఉపశమింప చేయడానికి ప్రయత్నించాలని నిశ్చయించింది.

14. ఎమ్ పి సి లోని అందరు సభ్యులు – డా. శశాంక్ భిడే, డా. అషిమా గోయిల్, ప్రొ. జయంత్ ఆర్ వర్మ, డా. మృదుల్ కె సగ్గర్, డా. మైకేల్ దేబబ్రత పాత్రా మరియు శ్రీ శక్తికాంత దాస్ – పాలిసీ రెపోరేట్ మార్చకుండా 4.0 శాతంగానే ఉంచాలని ఏకగ్రీవంగా వోట్ చేశారు. ఇంతేగాక, ఆర్థిక వ్యవస్థ స్థిరంగా పుంజుకొనేవరకు, అవసరమైనంతకాలం సానునయ విధానాన్ని అనుసరిస్తూ, ద్రవ్యోల్బణ లక్ష్యం పెరగకుండా, కోవిడ్ ప్రభావాన్ని ఉపశమింప చేయడానికి ప్రయత్నించాలని కూడా ఏకగ్రీవంగా వోట్ చేశారు.

15. సమావేశం యొక్క వ్యవహార సంగ్రహం (మినిట్స్) జూన్ 18, 2021 తేదీన ప్రచురించబడుతుంది.

16. ఎమ్ పి సి తదుపరి సమావేశం, ఆగస్ట్ 4 – 6, 2021 మధ్యలో జరుగుతుంది.

పాలిసీ రెపో రేట్ మార్పు లేకుండా 4.0 శాతంగా ఉంచాలని వోట్ చేసినవారు.

| **పాలిసీ రెపోరేట్ మార్పులేకుండా 4 శాతంగానే ఉంచవలెనన్న తీర్మానంపై వోటింగ్** | |
|---|---|
| **సభ్యుడు** | **వోట్** |
| డా. శశాంక్ భిడే | అవును |

| | |
|---|---|
| డా. అషిమా గోయల్ | అవును |
| ప్రొ. జయంత్ ఆర్ వర్మ | అవును |
| డా. మృదుల్ కె సగ్గర్ | అవును |
| డా. మైకేల్ దేబబ్రత పాత్ర | అవును |
| శ్రీ శక్తికాంత దాస్. | అవును |

**డా. శశాంక్ భిడే వివరణ**

17. 2021 ఆర్థిక సంవత్సరం నాలుగవ త్రైమాసికంలో, ఆర్థిక కార్యకలాపాలు బాగా కోలుకోవటం, కోవిడ్-19 ప్రతికూల ప్రభావం సమసిపోయిందని ఆశ కలిగిస్తోంది. జాతీయ గణాంక కార్యాలయం (నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్, ఎన్ ఎస్ ఓ) మే 31 న ప్రకటించిన తాత్కాలిక అంచనాల ప్రకారం వాస్తవ జి డి పి లో అభివృద్ధి -7.3 శాతం క్షీణించింది, అనగా, రెండవ భవిష్య అంచనాలకన్న తక్కువ క్షీణత. ముందు త్రైమాసికంతో పోలిస్తే, నాలుగవ త్రైమాసికంలో, మొత్తం గిరాకీ, 'ప్రైవేట్ / 'ప్రభుత్వ ఫైనల్ కన్సమ్ప్షన్' వ్యయం, ఎగుమతులు, గ్రోస్ ఫిక్స్డ్ క్యాపిటల్ ఫార్మేషన్ (వై-ఓ-వై) బాగా మెరుగయ్యాయి. ఉత్పత్తి రంగంలో, నిర్మాణ రంగం నాలుగవ త్రైమాసికంలో రెండంకెల వృద్ధి సాధించింది (వై-ఓ-వై). ఆర్థిక సంవత్సరం, 2021, నాలుగవ త్రైమాసికంలో, కార్పొరేట్ రంగం పనితీరుపైగల గణాంకాలు, అమ్మకం వసూళ్లు, మరియు గ్రోస్ వాల్యూ ఏడెడ్ మెరుగుపడినట్లు సూచిస్తున్నాయి, ప్రత్యేకించి తయారీ రంగంలో. కానీ, ఏప్రిల్, మే నెలలలో, కోవిడ్ 19 రెండవ దశ ఉధృతి కారణంగా, అధిక సంఖ్యలో కలిగిన మరణాలవల్ల, 2022 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో, మొదటి రెండు నెలలూ ఆర్థిక కార్యకలాపాలలో అవరోధాలు కలిగాయి. దీనితో, స్వల్పకాల అభివృద్ధి అంచనాలు, తిరిగి అంచనావేయవలసివచ్చింది.

18. 2020 సంవత్సరం, మహమ్మారి మొదటి దశలో, దేశవ్యాప్తంగా ప్రజల కదలికలపై నిర్బంధాలు విధించబడ్డాయి. అయితే, రెండవదశలో, స్థానికంగా ఆంక్షలు విధించబడ్డాయి.

కానీ, పెద్ద నగరాలలోకూడా వ్యాధి అతిగా వ్యాపించడంవల్ల, వాణిజ్య కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గ్రామీణ ప్రాంతాలు, మొదటిదశలోకన్న ఎక్కువ ప్రభావితమయ్యాయి.

19. వ్యాధి రెండవ దశ ప్రభావం మీద గణాంకాలు మితిగానే ఉన్నా, కుటుంబాలు మరియు వ్యాపార సంస్థలమీద జరిపిన సర్వేలు, నిరాశను వ్యక్తం చేస్తున్నాయి. వినియోగదారుల విశ్వాసంపై 13 పెద్ద నగరాలలో, ఏప్రిల్ చివరి వారంనుంచి మే 10, 2021 వరకు జరిపిన సర్వేలో, ఆర్థిక స్థితి క్రిందటి సంవత్సరంకంటే అధ్వాన్నంగా మారిందని భావించేవారి సంఖ్య విపరీతంగా పెరిగింది (రెండునెలలక్రితం జరిపిన ఇదే సర్వేతో పోలిస్తే). ముఖ్యంగా, సర్వేలో పాల్గొన్నవారిలో, 51.5 శాతం వచ్చే సంవత్సరంలో ఆర్థిక స్థితి ఇంకా హీనంగా మారుతుందని ఊహిస్తున్నారు. జూన్ 2021 నెలకు, రిజర్వ్ బ్యాంక్ జరిపిన ఇండస్ట్రియల్ అవుట్ లుక్ సర్వే ప్రాథమిక ఫలితాల ప్రకారం, తయారీ రంగానికి సంబంధించి, 2022 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో, ప్రస్తుత వాణిజ్య స్థితిపై 'సమ్మరీ ఇండెక్స్' (సమ్మరీ ఇండెక్స్ ఆఫ్ కరెంట్ బిజినెస్ కండిషన్స్) మరియు రెండవ త్రైమాసికం, అంచనాల సూచీలు (ఇండెక్స్ ఆఫ్ ఎక్స్పెక్టేషన్స్), క్షీణించాయి. పైన పేర్కొన్న అంశాలు, 2021 ఆర్థిక సంవత్సరం నాలుగవ త్రైమాసికంలో ఆర్థిక పరిస్థితులు, ఊహించిన దానికన్నా ప్రతికూలంగా ఉంటాయని సూచిస్తున్నాయి.

20. ఆర్థిక స్థితి ఏవిధంగా పరిణమిస్తుంది అన్న విషయం, క్రొత్తగా వ్యాధి సోక కుండా ప్రజలు తీసికొనే జాగ్రత్తలమీద ఆధారపడి ఉంటుంది. టీకా ప్రక్రియ వేగవంతం చేయడం, తగిన వైద్య వసతులు కల్పించడం, వినియోగదారులు, కార్మికులు, ఉత్పత్తిదారుల ఆర్థిక జీవనం తిరిగి కోలుకొంటుందని నమ్మకం కలిగించడానికి కీలకం. మహమ్మారి రెండవదశ, స్వల్పకాలిక ఆర్థికాభివృద్ధి అంచనాలపై, ఊహించని దెబ్బ కొట్టింది.

21. అభివృద్ధిచెందిన ఆర్థిక వ్యవస్థలలో (అడ్వాన్స్డ్ ఎకానమీస్, ఏ ఈ), పురోగతి వేగవంతమౌతుందన్న ఆశవల్ల, 2020లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వ్యాపారానికి, పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుందని అంచనా. కోవిడ్ -19 అదుపులోకి రావటం, ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పించటం, గిరాకీ పునరుద్ధరించుటకు తోడ్పడతాయి. అయితే, కొత్త రకాల వైరస్ లు వ్యాపించటం, టీకా ప్రక్రియ మందకొడిగా సాగటం, అభివృద్ధిని పరిమితం చేయవచ్చు.

22. అనేక వ్యవస్థలు, సంస్థలు 2022 ఆర్థిక సంవత్సరానికి సవరించిన చేసిన జి డి పి వృద్ధి అంచనాలలో, మహమ్మారి రెండవ దశ ప్రాథమిక ప్రభావం లెక్కలోకి తీసికోవటం జరిగింది. రిజర్వ్ బ్యాంక్ మే 2021 లో జరిపిన 'ప్రొఫెషనల్ ఫోర్ కాస్టర్ల' సర్వే ప్రకారం, 2022 ఆర్థిక సంవత్సరంలో జి డి పి అంచనాల మధ్య విలువ (మీడియన్ ఎస్టిమేట్ ఆఫ్ జి డి పి గ్రోత్), మార్చి 2021 లో ఉన్న 11 శాతంనుండి, 9.8 శాతానికి క్షీణించింది.

23. స్వల్పకాల అభివృద్ధి అంచనాలలో అనిశ్చితి ఉన్నా, కొన్ని అనుకూల అంశాలు లేకపోలేదు. ప్రపంచవ్యాప్తంగా అధికమవుతున్న గిరాకీ, ఎగుమతులు స్థిరంగా పెరగడానికి తోడ్పడతాయి. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో, మూలధన వ్యయం పెంచడం, దేశీ గిరాకీని ప్రేరేపిస్తుంది. అనుకూలమైన వర్షపాతంవల్ల, వ్యవసాయ రంగం ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. వీటి ఆసరాతో, ప్రైవేట్ వినియోగం మరియు పెట్టుబడుల వ్యయం పెరగాలంటే, కోవిడ్ -19 మహమ్మారి క్రమంగా తగ్గాలి.

24. ఈ నేపథ్యంలో, 2021-22 లో జి డి పి అంచనా 9.5 శాతం సాధించాలంటే (ఏప్రిల్ 21 లో 10.5 శాతానికి సవరించిన అంచనా) ఇతర ఆర్థిక కార్యకలాపాలు విస్తరించడంతోబాటు, విత్త మరియు ద్రవ్య విధానాల మద్దతు అవసరం. ఇంతేగాక, ప్రజలను మహమ్మారినుండి కాపాడాలి.

25. ఇంధన ధరల సూచీ 7.9 శాతం (వై-ఓ-వై) పెరిగినా, ఏప్రిల్ 2021 లో 'హెడ్ లైన్ ఇన్ఫ్లేషన్' 4.3 శాతం ఉంది. మార్చి 2021లో 5.9 శాతం పెరిగిన 'కోర్ ఇన్ఫ్లేషన్ సూచీ' (ఆహారం మరియు ఇంధనం మినహాయించి) ఏప్రిల్ నెలలో 5.4 శాతం పెరిగింది (ఆహార, ఇంధన ధరల పరోక్ష ప్రభావం, రవాణా ఖర్చుల ప్రత్యక్ష ప్రభావం కలిపి). పెరుగుతున్న ఇంధన ధరలూ, అంతర్జాతీయంగా ముడిసరుకుల ధరలూ, ఉత్పత్తి మరియు వితరణ వ్యయాన్నిఅధికం చేస్తాయి. పైగా, అన్ని రంగాలలో ఉత్పత్తి తిరిగి మొదలు కావడంతో పోటీ పెరుగుతుంది. ధరలపై ఈ ఒత్తిళ్లు తగ్గాలంటే, వ్యాపార మరియు రవాణా మౌలిక వ్యవస్థలను సమర్థవంతంగా నిర్వహించాలి. దీనితోబాటు, కదలికలపై నిర్బంధాలు సడలించాలి. ప్రస్తుత పరిస్థితులను అనుసరించి, 2021-22 సంవత్సరంలో 'హెడ్ లైన్ ఇన్ఫ్లేషన్' అంచనా 5.1 శాతం(ఏప్రిల్ 2021 అంచనాలకంటే, స్వల్పంగా ఎక్కువ).

26. ప్రస్తుతం, రెండవ దశ మహమ్మారి పంజానుండి ఆర్థిక వ్యవస్థ కోలుకోవడానికి, సహకరించే విధానాలు కల్పించడం అవసరం.

27. పాలసీ రెపో రేట్ మార్పులేకుండా 4.0 శాతంగానే ఉంచుటకు నేను వోట్ చేస్తున్నాను. ద్రవ్యోల్బణం లక్ష్యాన్ని మించకుండా జాగ్రత్త వహిస్తూ, ఆర్థిక వ్యవస్థపై కోవిడ్-19 ప్రభావాన్ని ఉపశమింపచేస్తూ, దీర్ఘకాల అభివృద్ధిని పునరుద్ధరించుటకు, అవసరమయినంత కాలం, సానుకూల ధోరణితో వ్యవహరించాలనికూడా వోట్ చేస్తున్నాను.

**డా. ఆషిమా గోయల్ వివరణ**

28. రెండవ దశ కరోనా వైరస్ కారణంగా జరిగిన జననష్టం, లెక్కించలేనిది. ఆర్థిక మూల్యం పరిమితిగానే ఉంటుంది. లాక్ డౌన్ ప్రక్రియ వికేంద్రీకరణ, అంతర్ రాష్ట్రీయ సరకు రవాణా కొనసాగుట, అంచెలంచెలుగా లాక్ డౌన్ సడలింపుల కారణంగా, క్రితం సంవత్సరం కన్నా గిరాకీ తగ్గుదల, సరఫరాలో తగ్గుదలకన్న చాలా ఎక్కువ. పెద్ద పట్టణాలలో, కార్పొరేట్లలో టీకా ప్రక్రియ జులై-ఆగస్ట్ నాటికి అత్యధిక స్థాయికి చేరడంవల్ల, త్వరలో సాధారణ స్థితి నెలకొంటుంది. మూడవ దశ కోవిడ్ గురించి అనిశ్చితి ఉన్నా, అత్యంత జనాభాగల ప్రాంతాలలో టీకా ప్రక్రియ చేపట్టి, వ్యాధి సోకే అవకాశం తగ్గించవచ్చు. రెండో దశ తీవ్రత, గ్రామ ప్రాంతాలలో మందకొడి సమయాలో, గడిచిపోయింది. మంచి వానలు కురియడంవల్ల, నాట్లు సాధారణంగానే కొనసాగుతాయి. పనిచేయుటకు, వలస కార్మికులు అందుబాటులో ఉన్నారు.

29. ద్రవ్య విధానానికి రెండు చిక్కులు ఉన్నాయి. ఒకటి, గిరాకీ తగ్గుదల, సరఫరాలో తగ్గుదలకన్న అధికంగా ఉందిగనుక, ఉత్పత్తిలో మిగులు అధికమయి, ద్రవ్యోల్బణం మీద గిరాకీ ఒత్తిడి తగ్గుతుంది. రెండవది, సరఫరా పెరిగి, గిరాకీ తగ్గితే, ఉత్పత్తి సంస్థల ధర నిర్ణయించే శక్తి సన్నగిల్లుతుంది. గత త్రైమాసికాలలో, ప్రపంచవ్యాప్తంగా ముడి వస్తువుల ధరలు పెరిగినందువల్ల, ఉత్పత్తి వ్యయం పెరిగి, టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం రెండంకెలకు పెరిగింది. నిజానికి, సంస్థలు మహమ్మారి కాలంలోకూడా వారి లాభాల పెంచుకొన్నాయి. ఇది బహుశా, వినియోగ సామర్థ్యం తగ్గినందువల్ల కావచ్చు. తగ్గిన వేతనాల, ప్రయాణం వంటి ఇతర ఖర్చులలో తగ్గుదల ప్రయోజనం వారు అందించలేదు. ఇంతేగాక, సామాన్యంగా టోకుధరల సూచీ నుండి వినియోగదారుల సూచీకి ప్రయోజనం తక్కువగా అదీ జాప్యంతో కలుగుతుందిగనుక, వేతనాలలో పెంపు అంతగా లేకుండా రెండోసారి ద్రవ్యోల్బణం పెరగకుండా

నిరోధించవచ్చు. అంతర్జాతీయ ధరల ఒత్తిడి, తాత్కాలికమని, సరఫరాలో ఇబ్బందులు మరియు రద్దీ తగ్గిన తరువాత, తొలగిపోతుందని ప్రస్తుతం ప్రబలమైన అభిప్రాయం. కొన్ని దేశాలలో ఇంతకు ముందు కనీవినీ ఎరుగని ప్రోత్సాహకాలు కల్పించినా, ఆర్థికస్థితి అభివృద్ధిలో అసమానతలూ, అనిశ్చితులు గిరాకీకి కళ్ళెంవేయవచ్చు. 'హెడ్ లైన్ సి పి ఐ', ఎమ్ పి సి ఊహించిన పరిమితిలోనే ఉండవచ్చని అంచనా. అయితే కాలాన్నిబట్టి, లాక్ డౌన్ల విధింపు వల్ల, అప్పుడప్పుడు పెరగవచ్చు.

30. మార్చి నెలతో పోలిస్తే, కుటుంబ ద్రవ్యోల్బణ అంచనాలలో తెలిపిన పెరుగుదల వాస్తవంగా కలుగుతుందా? ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, ప్రస్తుత సర్వే ఏప్రిల్ 29 నుండి మే 11 వరకు జరిగింది. మే 7 వ తేదీ, కొత్త వైరస్ బారినపడ్డ వారి సంఖ్య అత్యధికంగా, 4 లక్షలు దాటింది. ఈ సమయంలో ప్రజలు తీవ్రమైన భీతికి, అనిశ్చితికి లోనయ్యారు. వినియోగదారుల అంచనాలు దీనివల్ల ప్రభావితమయ్యాయి. వినియోగదారుల స్పందనలో అనేక వైరుధ్యాలు ఉన్నాయి. ఉదాహరణకి, ఆహారేతర వస్తువుల ద్రవ్యోల్బణం తగ్గుతుందని అంచనా, కానీ మొత్తం మీద ద్రవ్యోల్బణం పెరుగుతుందని అభిప్రాయం. వినియోగదారుల విశ్వాస సర్వే ప్రకారం, ద్రవ్యోల్బణం అధికంగానే ఉన్నాగానీ, తగ్గుముఖం పడుతుందని అంచనా. సర్వేలు అర్థవంతంగా ఉండాలంటే, సాధారణ సమయాలలో సర్వేలు జరపాలి.

31. కోవిడ్ మొదటి దశలోకన్నా రెండవ దశలో, వినియోగాదారుల విశ్వాసం మరింత దిగజారింది. అయితే, జనవరి 2021, జులై 2019 లో ఉన్న స్థాయికి పెరిగింది. ప్రస్తుతం కూడా అదే జరగవచ్చు. నష్టభయం ఎక్కువ కావడం వల్ల వినియోగదారుల గిరాకీ తగ్గుతుందా లేక ఇన్నాళ్ళూ బలవంతంగా అణచిపెట్టిన కారణంగా గిరాకీ ఇప్పుడు అకస్మాత్తుగా పెరుగుతుందా అన్నది, ఇంకా స్పష్టం కాలేదు. ఆదాయాలు తగ్గడం, ఉపాధి కోల్పోవడం, అప్పుల్లో కూరుకుపోవడం, పేదరికం, తప్పకుండా గిరాకీని క్రుంగదీస్తాయి.

32. ఎమ్ పి సి, నియమిత కాల నిర్దేశాలనుండి (టైమ్ బేస్డ్ గైడెన్స్), గణాంక ఆధారిత నిర్దేశాలవైపు (డాటా బేస్డ్ గైడెన్స్) మళ్ళింది. అనిశ్చిత పరిస్థితులలో, అంచనాలు, ఆశలూ, అంతగా విశ్వసించలేము. అందువల్ల, ముందుజాగ్రత్త వహిస్తూ, వాస్తవ ఫలితాలకై వేచి ఉండి, ద్రవ్యోల్బణంలో రెండవ దశ 'పాస్ త్రూ' మరియు సరఫరాలోగల సమస్యలు తీరే సంకేతాలను గమనిస్తూ ఉండడం ముఖ్యం. అంచనాలు తలక్రిందులయితే, నష్టం

తగ్గించుకోవాలంటే, అతిగా స్పందించకూడదు. ఆర్థిక విధానం ఫలితం చూపడానికి సమయం పడుతుందిగనుక, సవరణలు క్రమేపీ చేయాలి కానీ, మరీ అధిక జాప్యం పనికిరాదు.

33. ప్రస్తుతం, ఉత్పత్తిలో అంతరం పెరిగిందికనుక, ద్రవ్యోల్బణం అనుకొన్న పరిమితిలోనే ఉంటుందని అంచనావల్ల, స్థూల ఆర్థిక విధానం గిరాకీ పెంచడంపై కేంద్రీకరించాలి. స్వల్పకాల వాస్తవ వడ్డీ ఇప్పటికే ప్రతికూలంగా ఉంది మరియు సమస్థితికి దగ్గరగా రావచ్చు. ఈ పరిస్థితిలో, లిక్విడిటీ మాత్రమే అదనపు ప్రయోజనం కల్పించగలదు. లక్షిత పథకాలద్వారా, యీల్డ్ కర్మని సరిచేసి, అవసరమయిన చోటకు నిధులు మళ్లించవచ్చు. బలహీనమైన గిరాకీ కారణంగా రుణాలు పెరగడం లేదు. అధిక ద్రవ్యతను బ్యాంకులు రివర్స్ రెపోలో ఉంచినందువల్ల 'బ్రాడ్ మనీ' సరఫరాలో పెరుగుదల తక్కువగా 9.9 శాతం ఉంది. ఇందువల్ల, అధిక ద్రవ్య సరఫరా, ద్రవ్యోల్బణాన్ని పెంచుతుందన్న భయం ప్రస్తుతం, అంతగాలేదు.

34. ఈ నేపథ్యంలో, పాలిసీ రెపో రేట్ మార్పులేకుండా 4.0 శాతంగానే ఉంచుటకు నేను వోట్ చేస్తున్నాను. ద్రవ్యోల్బణం లక్ష్యాని మించకుండా జాగ్రత్త వహిస్తూ, ఆర్థిక వ్యవస్థపై కోవిడ్-19 ప్రభావాన్ని ఉపశమింపచేస్తూ, దీర్ఘకాల అభివృద్ధిని పునరుద్ధరించుటకు, అవసరమయినంత కాలం, సానుకూల ధోరణితో వ్యవహరించాలనికూడా వోట్ చేస్తున్నాను.

35. ప్రభుత్వ లోటు, 'కౌంటర్ సైక్లికల్' ప్రక్రియద్వారా మితంగా పెరుగుదలకు అవకాశం ఉంది. దీనితోబాటు, పన్ను వసూళ్లు పెంచగలిగితే 'రిస్క్ ప్రీమియంలో' పెరుగుదల నివారించబడి, ద్రవ్య విధానం వాస్తవ వడ్డీ రేట్లు పునరభివృద్ధికి దోహదంచేసే స్థాయిలో ఉంచుట సాధ్యపడుతుంది.

36. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడి, గిరాకీ పెరగడం, భారత ఎగుమతులకు ఊతమనిచ్చింది. అయితే, ప్రపంచ దేశాల అభివృద్ధిలో అసమానతలవల్ల, ఎగుమతులు మళ్ళీ తగ్గే ప్రమాదం ఉంది. యు ఎస్ ఉద్దీపనల విరమణ, ఎమెర్జింగ్ మార్కెట్ల నుండి నిధుల ప్రవాహం ప్రోత్సహించవచ్చు. భారతదేశం వారి వడ్డీరేట్ల విధానాన్ని 'డొమెస్టిక్ సైకిల్' కు అనునయంగా రూపొందించేందుకు సరిపోయిన నిల్వలు కలిగి ఉంది, యు ఎస్ సైకిల్ అనుసరించాల్సిన బలవంతంలేదు. ఇంతేగాక, ప్రస్తుతం, యు ఎస్ బాండ్లపై ఆదాయం తగ్గుతోంది మరియు డాలర్ బలహీనపడుతోంది. ఇది, ఉద్దీపనల విరమణ సరళంగానే సాగుతుందని సూచిస్తోంది. 'ఫెడ్' ద్రవ్యోల్బణ లక్ష్యం 2

శాతం దాటి, కొన్ని నెలలు కొనసాగినప్పటికీ, దీర్ఘకాల ద్రవ్యోల్బణ అంచనాలు అస్థిరమయే అవకాశం లేదు. ఎందుచేతనంటే, ప్రపంచ ఆర్థిక సంక్షోభం తరువాత, ద్రవ్యోల్బణం చాలా సంవత్సరాలు 2 శాతానికి దిగువన ఉన్నా, అంచనాలు అస్థిరం కాలేదు. పైగా, సెక్యూరిటీలు గడువు ముగిసిన తరువాత ఫెడ్ బ్యాలన్స్ షీట్ నెమ్మదిగా సంకోచించి, వడ్డీ రేట్లు క్రమంగా పెరిగితే, ప్రోత్సాహకాలు నిలిపివేసినా, బాండ్ మార్కెట్లు అంతగా అస్థిరం కావని అవగతమయింది.

**ప్రొ. జయంత్ ఆర్ వర్మ వివరణ**

37. 2021 సంవత్సరం ప్రారంభంలో కనిపించిన ఆర్థిక అభివృద్ధి, రెండవ దశలో, మహమ్మారి కలిగించిన విపరీతమైన ప్రాణ నష్టం కారణంగా, నిరోధించబడింది. కానీ, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తగ్గింది. రెండవ దశ మహమ్మారి తీక్షణత దాటిపోయినందువల్ల, ఆర్థిక కార్యకలాపాలు త్వరలో పుంజుకొంటాయని, 'హై ఫ్రీక్వెన్సీ ఇండికేటర్లు' ఆశ కలిగిస్తున్నాయి. మహమ్మారి మొదలయినాటినుండి, ప్రస్తుత మరియు భవిష్య అంచనాలు విశ్వసనీయంగా లేవు.

38. ద్రవ్యోల్బణ రేట్లు, చాలాకాలంనుంచి, సహనపరిమితి (టాలరెన్స్ జోన్) మధ్యస్థానానికి పైనే, నిలకడగా ఉన్నాయి. మరికొంతకాలం అలాగే ఉంటాయని అంచనా. సర్వేలు, ఇతరసూచీలు, వ్యాపారస్తులు, పెరిగిన ధరలని వినియోగదారులనుండి సులభంగా వసూలుచేయటమేగాక, వారి లాభాలు తగ్గకుండా (నిజానికి, ఎక్కువయేలా) నిర్వహిస్తున్నారని తెలుపుతున్నాయి. అయితే, సంతోషించదగ్గ ఏకైక విషయమేమిటంటే, ప్రస్తుతంగల నిదర్శనాలు, ద్రవ్యోల్బణం దేశీ గిరాకీవల్లకాక, ప్రపంచవ్యాప్తంగా ముడిసరుకు ధరలు అధికం కావడంవంటి సరఫరా సమస్యలవల్ల పెరుగుతోందని సూచిస్తున్నాయి. అభివృద్ధి వేగవంతమయితే, ఈపరిస్థితి మారవచ్చు. కానీ, ద్రవ్యోల్బణం చాలాకాలం హెచ్చుగానే ఉంటే, అంచనాలు అదే రకంగా స్థిరపడిపోయే ప్రమాదం ఉందని ఎమ్ పి సి గమనించాలి. ద్రవ్యోల్బణం లక్ష్యంకన్నా అధికంగా ఉన్నాగానీ, ఎమ్ పి సి సమర్థవంతంగా ద్రవ్యత సర్దుబాటు చేయగలుగుతోంది అంటే, దానికి కారణం ద్రవ్యోల్బణ లక్ష్యాన్ని సాధించుటలో వారు శ్రమతో సంపాదించుకొన్న విశ్వసనీయత. ఈ విశ్వసనీయత పెరగాలంటే, భవిష్యత్తులో ఊహించని సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే, ఎమ్ పి సి గణాంకాల ఆధారంగా (డాటా బేస్డ్) చర్యలు చేపట్టాలి.

39. ప్రస్తుత విధాన నివేదికకు సంబంధించి, లాభ నష్టాలు పరిశీలించి, సానునయ విధానం అవలంబించడం మేలని నేను నమ్ముతున్నాను. అందుచేత, ప్రస్తుత పాలసీ రెపో రేట్ మార్పులేకుండా కొనసాగించడానికి, సానునయ ధోరణి పాటించడానికి నేను మద్దతు తెలుపుతున్నాను.

## డా. మృదుల్ కె సగ్గర్ వివరణ

40. తీసికోబోయే నిర్ణయానికి, చేయవలసిన విధాన సర్దుబాట్లు చర్చించేముందు, అభివృద్ధి మరియు ద్రవ్యోల్బణ అంచనాలు తెలియచేస్తాను.

41. మధ్యకాలంలో అతిగా పెరిగిన కోవిడ్ కేసుల సంఖ్య, ప్రస్తుతం క్రిందటి ఎమ్ పి సి సమావేశం జరిగినప్పుడుగల స్థాయికి వచ్చింది. సంక్రమిత వ్యాధుల తీరుని పరిశీలిస్తే, ప్రస్తుత దశ, జూన్ చివరికి సన్నగిలిపోతుంది. ఆవెనువెంటనే, ఆర్థిక స్వస్థత మొదలవుతుంది. వ్యాధి తదుపరి దశలగురించి స్పష్టత లేదుగనుక, దానిని హానిచేయగలిగే అంశంగా భావించాలేతప్ప, వాస్తవ ప్రాతిపదికగా తీసికోరాదు.

42. ఓదార్పు కలిగించే విషయమేమిటంటే, క్రితం సంవత్సరంవలె, మొదటి త్రైమాసికంలో అభివృద్ధి కుప్పకూలిపోలేదు. పనికి సంబంధించి, ‘గూగుల్’, ‘ఏపిల్’ మొబిలిటీ సూచీలు; జి ఎస్ టి ఈ-వే బిల్స్ జారీ; టోకు / చిల్లర డిజిటల్ చెల్లింపులు, వరుసగా దిగజారుతూవస్తున్నా, క్రితం సంవత్సరంతో పోలిస్తే ఎంతో ఎక్కువగా ఉన్నాయి. దీనితో, మొదటిత్రైమాసికంలో అభివృద్ధిలో క్షీణత (క్రితం సంవత్సరం మొదటి త్రైమాసికం కన్నా) తక్కువగా, 18 శాతం ఉంటుందన్న అంచనాని బలపరుస్తుంది (క్రిందటి సంవత్సరం 29.7 శాతం). ప్రాథమిక జి డి పి అంచనాలు, పూర్తి చిత్రాన్ని చూపించకపోవచ్చు, ఎందుకంటే, అనియత / అసంఘటిత ఆర్థిక రంగంపై ప్రభావం తీవ్రంగా ఉండి ఉండవచ్చు. పైగా, ఈ సంవత్సరం ఆర్థిక రంగం 9.5 శాతం అభివృద్ధి సాధిస్తే, 2021-22 లో ఉత్పత్తి స్థాయి కేవలం 1.6 శాతం అధికమవుతుంది (2019-20 లో మహమ్మారి ముందుస్థాయికన్న). ఈ రెండు కారణాలవల్ల, అభివృద్ధికి విధాన మద్దతు అకాలంగా నిలిపివేయరాదు. అయితే, ద్రవ్య / విత్త విధానాలు కౌంటర్ సైక్లికల్ మద్దతు అందించినాగానీ, స్థిరమైన అభివృద్ధి ఆరోగ్య సౌకర్యాలమీద, మితమైన విత్త విధానాలు, క్యాపెక్స్ వ్యయం పెంచుట మరియు మౌలిక సంస్కరణల ద్వారా, ఏమేరకు ఉత్పత్తిని పెంచగలమ అన్న అంశాలపై ఆధారపడి ఉంటుంది.

43. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకొంటోంది. వృద్ధి రేటు, యు ఎస్ కోలుకోవటం, యూరో దేశాలలో క్రమేపీ వృద్ధిచెందటం వల్ల, 6 శాతం దాటవచ్చు. చైనాలో వరుస త్రైమాసికాలలో కనిపిస్తున్న మందకొడితనాన్ని, తగిన విధాన చర్యలతో అరికడితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిచెందే వేగం ఆశ్చర్యం కలిగించవచ్చు. కానీ, ప్రపంచ ద్రవ్యోల్బణం నుండి ' పాస్ త్రూ' ప్రభావం అధికం కావచ్చు. ప్రపంచవ్యాప్తంగా 'కంటైనర్ల' కొరత, నికర ఎగుమతులను పరిమితం చేయవచ్చు. 'క్యాపసైజ్' రవాణా ఛార్జీలు, మే నెలలో తగ్గుముఖం పట్టడం, పోర్టులలో రద్దీ తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నట్లు తెలుపుతున్నాయి. ప్రభుత్వం జి డి పి లో ఐదవ భాగం ఉత్పత్తిచేస్తుంది. కనుక, ప్రభుత్వ వ్యయం, అభివృద్ధికి ముఖ్యం. ఈ సంవత్సరం బడ్జెట్ లక్ష్యం, వినియోగానికన్నా పెట్టుబడులకు మరింత ఎక్కువగా వ్యయం చేయాలని. దీని అధిక మల్టిప్లయర్ వల్ల, అభివృద్ధికి మంచి జరుగుతుంది. చివరిగా, సకాలంలో, విస్తారమైన వర్షపాతం ఎల్ పి ఏ కన్నా 101 +, - 4 శాతం కలుగుతుందన్న అంచనా, పరిస్థితి దిగజారే ప్రమాదాన్ని తగ్గించింది. అయితే, ఆగస్ట్ నెలలో ఎమ్ పి సి సమావేశం జరిగే సమయానికి ఈ విషయమై స్పష్టత లభిస్తుంది.

44. ద్రవ్యోల్బణం, భరించదగిన పరిధిలోనే ఉన్నా, లక్ష్యానికి మించి ఉంటుంది. ఆగస్ట్ నెలవరకూ ద్రవ్యోల్బణం, పైన పరిమితికి దగ్గరగానే ఉంటుంది. ఆ తరువాత, మంచి ఖరీఫ్ దిగుబడి వచ్చి, ప్రపంచవ్యాప్తంగా సరుకుల ధరలు తగ్గినట్లయితే, ద్రవ్యోల్బణంకూడా తగ్గుముఖం పట్టవచ్చు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, వేడిమీద ఉన్నందువల్ల, ముడిసరుకుల ధరలు హెచ్చుగానే ఉండే భయం ఉంది. అయినప్పటికీ, గిరాకీ ప్రత్యామ్నాయ ముడి సరుకులకు మారడం మరియు ఈ ఎస్ జి చొరవ కారణంగా ధరలు తగ్గి, ముడి చమురు, ఇనప ఖనిజం మరియు ఉక్కు ధరలు పెరగడం ఆగిపోవచ్చు లేక తిరుగుముఖం పట్టవచ్చు. ముడి చమురు, కాయధాన్యాలు వంట నూనెలు, ప్రత్తి ధరలు దేశీ ద్రవ్యోల్బణం మీద ఒత్తిడి కలిగించినా, సత్వరమైన విత్త లేక సరఫరా సంబంధిత చర్యలద్వారా అదుపుచేయవచ్చు.

45. మనం ప్రస్తుతం రాజీపడవలసిన విధానాలను చూద్దాము. ముఖ్యమైన మొదటి విషయం, ద్రవ్యోల్బణం సంవత్సరం పొడుగునా లక్ష్యానికి ఎగువగా, పైన పరిమితికి దగ్గరగా ఉంటుంది. 'ఫ్యాన్ చార్ట్' లో సూచించిన 'ప్రొబబిలిటీ డిస్ట్రిబ్యూషన్', పైన పరిమితి దాటే ప్రమాదం లేకపోలేదని

తెలుపుతోంది. ప్రస్తుత విపరీత పరిస్థితులు లేకపోతే, ఎంతోకాలం క్రితమే మధ్యస్థ స్థాయికి చేరుకొనేవాళ్లము. అక్టోబర్ 2020 లో, ఉత్పత్తిలో కొరత, 2021-22 చివరకు తీరుతుందని నేను తెలిపాను. రెండో దశ కారణంగా సామాన్య స్థితికి రావడానికి మరికొంత సమయం పట్టవచ్చు, కానీ దీర్ఘకాలం కాదు. సంవత్సరం చివరకు, జి డి పి నిష్పత్తిగా చూస్తే, ఉత్పత్తి కొరత తీరవచ్చని, అనేక 'ఫిల్టరింగ్ టెక్నిక్' లు సూచిస్తున్నాయి. కానీ, ఈ విధానాలు 'ఎండ్ పాయింట్స్' మీద ఆధారపడినవిగనుక, వీటిని పూర్తిగా నమ్మలేము. ఈ అనిశ్చితికి తగిన సర్దుబాటు చేయాలి. ద్రవ్యోల్బణ లక్ష్య నిర్ణయ విధానంలో, దీర్ఘకాల ద్రవ్యోల్బణం, సహన పరిమితుల మధ్యలో (టాలరెన్స్ బ్యాండ్స్) ఉన్నంతవరకు, తాత్కాలికంగా లక్ష్యాన్ని మీరగలిగే వెసులుబాటు ఉంది. అందువల్ల, ప్రస్తుత సమయంలో అభివృద్ధికి మద్దతు కొనసాగించాలి. ధరల పెరుగుదల కారణంగా, టోకు ధరల సూచీ స్థాయి / ద్రవ్యోల్బణ వేగం, అధికంగా ఉన్నాయిగనుక, ద్రవ్యోల్బణం పెరుగుతుందని భయం ఉంది. అయితే గిరాకీ కొరతవల్ల, 'కాస్ట్ పుష్ ఇన్ఫ్లేషన్' యొక్క ప్రభావం చిల్లర ధరలపై పడలేదు. ఇంతేగాక, పరపతిలో అభివృద్ధి బలహీనంగా ఉంది, రివర్స్ రేపోకు సవరించిన మనీ మల్టిప్లయర్, తక్కువగా ఉంది. అందువల్ల, ఈసమయంలో, అభివృద్ధికి సహాయం కొనసాగించాలి. సి పి ఐ ద్రవ్యోల్బణంలో సాధారణీకరణ ఏర్పడుతున్న చిహ్నాలు, అభివృద్ధి-ద్రవ్యోల్బణం గతులు మార్చగలవని నా అభిప్రాయం. ద్రవ్యోల్బణం మరింత పెరుగుతుందని అంచనాలు ఉన్నాయి. ఈఅంచనాలు నిజమయితే, విధానపరమైన చర్యలు అవసరం. రెండవ అర్ధ సంవత్సరంలో ద్రవ్యోల్బణం మెతకపడితే, ఈ అవసరం రాకపోవచ్చు. రాబోయే అనిశ్చిత పరిస్థితులు, కాల ఆధారిత నిర్దేశాలు మానివేయడానికి హేతువులు, ప్రత్యేకించి ప్రసారంలో జాప్యం జరుగుతున్నకారణంగా.

46. రెండవది, పాలిసీ రేట్లు మార్పులేకుండా ఉంచాలా లేక మదుపరులకు నష్టం కలిగించే ప్రతికూల వాస్తవ రేట్లు, ఏదో ఒకసమయంలో సరిదిద్దాలా అనే ప్రశ్న. 'హెటెరోజీనస్ ఏజంట్స్ న్యూ కీనేసియన్ మోడల్స్', కేంద్రీయ బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించినపుడు తప్పనిసరిగా అందరు మదుపరులూ నష్టపోరని, ఆలోచన కలిగిస్తోంది. మోడల్స్, అదనంగా విభిన్నమైన ప్రభావాలు పరిగణిస్తాయి. ద్రవ్య వ్యాకోచంవల్ల, గిరాకీ పెరిగినప్పుడు, కంపెనీలు ఉత్పత్తి పెంచుతాయి. ఇది మహమ్మారి వంటి సమయాలలోకూడా, సంస్థలు బ్రతికి ఉండేందుకు సహాయపడుతుంది.

ఇందువల్ల, వేతనాలు, జీతాలు పెరిగి, వారి పొదుపుపై వడ్డీ ఆదాయం తగ్గినందువల్ల కలిగిన నష్టం పూరించబడుతుంది. భారతదేశంలో ఉన్న, అల్ప ఆదాయం, పేదరికం, రెండోదశ పరోక్ష ప్రభావం మరింత తీవ్రతరం స్తాయి. ఇంతేగాక, తక్కువ వడ్డీ రేట్లు, అభివృద్ధికి సహాయపడే విత్త చర్యలు తీసికొనుటకు వీలు కల్పిస్తాయి. ప్రస్తుతం సానుకూలమైన ద్రవ్య విధానం పాటించుటకు, ఇటువంటి 'మల్టిప్లయర్' ప్రభావాలు బలమైన కారణం. పైన పేర్కొన్న విధానం, అత్యంత కఠిన సమయంలో, గాయాలు తగ్గించి, ఉద్యోగుల తొలగింపు తగ్గించి, ఆస్తుల విలువ పెంచి ఆదాయాలను, వినియోగాన్ని పెంచుటకు సహాయపడిందని, నా భావన. అయితే, దీనిని దీర్ఘకాలం కొనసాగించడంవల్ల, వాస్తవ ఆదాయాలు మరియు వేతనాలు తగ్గి, వాటి వితరణకూడా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. సానునయ ద్రవ్య విధానం, విత్త విధాన వ్యాకోచంతో కలిసినప్పుడు, ఉత్పత్తి కొరత తగ్గిస్తుంది. కానీ, దీనివల్ల కొంతకాలానికి, 'ఫిలిప్స్ కర్వ్' మరీ దిగజారవచ్చు.

47, ఏది ఏమయినా, చిల్లర ద్రవ్యోల్బణం కేవలం గిరాకీకారణంగా పెరగడం లేదు. ఈ పరిస్థితిలో, ఉత్పత్తిని పణంగా పెట్టడం మంచి నిర్ణయం కాదు. పైన పేర్కొన్న విధాన సర్దుబాట్లను దృష్టిలో ఉంచుకొని, ప్రస్తుతం అభివృద్ధికి సహాయం నిలిపివేయడం అనుచిత చర్య అని నా అభిప్రాయం. అందువల్ల, ప్రస్తుత పాలిసీ రేట్ కొనసాగించాలనీ మరియు తీర్మానంలో ప్రకటించిన ధోరణి పాటించాలనీ, నేను వోట్ చేస్తున్నాను.

**డా. మైకేల్ దేబబ్రత పాత్రా వివరణ**

48. నేను పాలిసీ రేట్ యథాతథంగా ఉంచాలనీ, మరియు పాలిసీ వైఖరికి అనుకూలంగా వోట్ చేస్తున్నాను.

49. అభివృద్ధి-ద్రవ్యోల్బణం మధ్య సర్దుబాట్లు తదనుకూలమైన విధాన ఎంపికలు సానుకూలధోరణివైపు మొగ్గు చూపుతున్నాయి. ఏప్రిల్ మరియు మే 2021, 'హై ఫ్రీక్వెన్సీ' సూచీలు, 2020-21 రెండవ అర్ధసంవత్సరం మొదలయిన పురోగమనం నిలిచిపోయిందని తెలుపుతున్నాయి. మొదటి దశతో పోలిస్తే, రెండవ దశలో సరఫరా పరిస్థితులు మెరుగుగానే ఉన్నాయి, కానీ సమిష్టి గిరాకీ (నికర ఎగుమతులుతప్ప) దెబ్బతింది. ఈ పరస్థితి సరిచేయడానికి, మహమ్మారి ప్రతికూల విధానాల మద్దతు అవసరం. నికర ఎగుమతులలో పెరుగుదలకూడా, ముఖ్యంగా టీకా ప్రక్రియ బలోపేతమైన కారణంగా పెరిగిన బాహ్య గిరాకీ వల్ల కలిగింది.

అంతర్జాతీయంగా సరుకుల ధరలు, ప్రత్యేకించి ముడి చమురు ధరలు, పెరగడంచేత ఈ ప్రయోజనం కొంతమేరకు కోల్పోవచ్చు.

50. ఏప్రిల్ ద్రవ్యోల్బణం కొంత ఊరట కలిగించింది. కొన్ని ఆహార ద్రవ్యాల ధరలు, సామాన్యంగా వర్షాకాలానికి ముందు పెరిగినా, కొంతకాలం వరకు, అనుకూలంగానే ఉంటాయని ఇటీవలి సమాచారం సూచిస్తోంది. ముడి వస్తువుల ధరలు కోర్ ద్రవ్యోల్బణాన్ని హెచ్చుగానే ఉంచుతాయి. ఆహార ధరలు, సరఫరా / గిరాకీల మధ్య అంతరం ప్రతిబింబిస్తాయి. కానీ, గిరాకీ బలంగా లేనందువల్ల, రిటైల్ ద్రవ్యోల్బణంపై ప్రభావం, ప్రత్యేకించి సేవారంగంలో, అసంపూర్తిగా మరియు ఆలస్యంగా కలుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా గిరాకీ, మహమ్మారి పూర్వపు స్థితికి ఎంతమేరకు, ఏ సమయంలో చేరుకుంటుందో అనే విషయంపై అనిశ్చితి కారణంగా, ఇంధన ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. పరిస్థితి నిశితంగా పరిశీలిస్తూ, సుంకాలూ/ పన్నులూ తగ్గించడంద్వారా ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి తయారుగా ఉండాలి. మంత్రుల బృందం సరఫరా స్థితిగతులు క్షుణ్ణంగా పర్యవేక్షించడం, సరైన దిశలో తీసికొన్న నిర్ణయం. దిగుమతి ధరలు, ద్రవ్యోల్బణాన్ని పెంచకుండా ఈ బృందం సక్రియాత్మక చర్యలు చేపట్టాలి.

51. పాలిసీ రేట్ ఇంతకు ముందెన్నడూ లేనంత తక్కువచేసి, అభివృద్ధి ప్రోత్సహించడానికి, అవసరమైన వాతావరణం, ఎమ్ పి సి కల్పించింది. ఏప్రిల్ ద్రవ్యోల్బణం, లక్ష్యానికి అనుసారంగా ఉండడం, ఆతరువాత సహన పరిమితుల అంచనాల మధ్యలో ఉండటానికి, అవకాశాలు తక్కువగా ఉన్న పరిస్థితులలో, స్వల్పకాలిక వడ్డీరేట్ల ద్వారా, కోవిడ్-19 కారణంగా ధ్వంసమైన వ్యవస్థను తిరిగి దారిలో పెట్టే చర్యలు తీసికొని, వారి భవిష్య నిర్దేశాలపై విశ్వసనీయత పెంచింది. ఎమ్ పి సి సలహాలు ఎల్లప్పుడూ పాటిస్తూ, ఆర్థిక వ్యవస్థకు మరియు, నిర్దిష్ట రంగాలకు, సాధనాలకు, సంస్థలకు సానుకూలమైన పరిస్థితులు కల్పించే చర్యలు తీసికోవడం, రిజర్వ్ బ్యాంక్ బాధ్యత. ద్రవ్య సరఫరా చాలినంత ఉన్నా, పరపతి పెరుగుదల మందంగా ఉండటంచేత, రుణసహాయానికి, మార్కెట్ ఆధారిత / రిఫైనాన్సింగ్ సంస్థలవంటి ఇతర మార్గాలను, రిజర్వ్ బ్యాంక్ ప్రేరేపిస్తోంది. ద్రవ్య విధాన వైఖరి ప్రయోజనాలు, వడ్డీరేట్లలో ప్రతిబింబించే విధంగా చర్యలు చేపడుతోంది. ఎమ్ పి సి, ఈసమావేశంలో పాలిసీ రేట్ మార్పులేకుండా ఉంచి, సానుకూల ధోరణి కాపాడడంద్వారా,

ఆర్థిక స్థితిని మెరుగుచేసే అవకాశాన్ని రిజర్వ్ బ్యాంకుకు కల్పిస్తోంది.

**శ్రీ శక్తికాంత్ దాస్ వివరణ**

క్రితం ఏప్రిల్ నెలలో మనం సమావేశమయినప్పుడు, కోవిడ్-19 రెండోదశ అప్పుడే వ్యాపించడం మొదలయింది. కానీ కొన్ని రాష్ట్రాలకే పరిమితమయింది. అయితే, తరువాతి వారాలలో, దాని విస్తరణ, తీక్షణత విపరీతంగా చెలరేగింది. ఆరోగ్య వ్యవస్థ ఒత్తిడికిలోనయి అపార ప్రాణ నష్టం కలిగింది. రాష్ట్రాలు విధించిన లాక్ డౌన్ నిబంధనలు, నిర్బంధ చర్యలు, క్రొత్త కేసులు ప్రబలకుండా నిరోధించాయి. కానీ 'హై ఫ్రీక్వెన్సీ' సూచీలు తెలిపినట్లు ఆర్థిక వ్యవస్థకు, కొంతమేరకు నష్టం కలిగించాయి. కొన్ని రాష్ట్రాలలో నిబంధనలు సడలించడం మొదలయ్యింది. ఇది కొనసాగితే, జులై ఆరంభంనుంచి దేశవ్యాప్తంగా కార్యకలాపాలు సామాన్య స్థితికి చేరుకొంటాయి.

53. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో గిరాకీ, ఆర్థిక వ్యవహారాలు సామాన్యస్థితికి చేరుకొంటున్నాయని సూచిస్తోంది. రియల్ ఎస్టేట్, తయారీ రంగం, నిర్మాణ రంగం, వ్యాపారం మరియు ఆర్థికసేవలు కోలుకొంటున్న కారణంగా, 20200-21 నాలుగవ త్రైమాసికానికి బలం పుంజుకొంటాయని సూచిస్తున్నాయి. వ్యాధి తగ్గుతున్న కారణంగా ఇటీవల 2020-21 నాలుగవ త్రైమాసికంలో, 'క్యాపెక్స్ సైకిల్' ఉజ్జీవితమవుతున్నట్లు, ఉక్కు వినియోగం, సిమెంట్ ఉత్పత్తి, దిగుమతులు మరియు ఉత్పాదన, సూచిస్తున్నాయి. అదే త్రైమాసికంలో, 'రియల్ గ్రోస్ వాల్యూ ఏడెడ్' పెరుగుదల ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. రెండవ దశ ఈ వేగాన్ని అకస్మాత్తుగా భగ్నం చేసింది.

54. వ్యాధి నిరోధక చర్యలు, ఈ సారి, స్థానికంగా క్రమానుబద్ధంగా తీసికోబడ్డాయి. ఇందువల్ల, తయారీ మరియు పరిశ్రమల కార్యకలాపాలు, వివిధ స్థాయిలలో కొనసాగించబడ్డాయి. అదే సమయంలో, వ్యాపార, సరఫరా వ్యవస్థలు, కోవిడ్ నిబంధనల పరిధిలో పనిచేయటానికి అలవాటు పడ్డాయి. పైగా, కార్మికుల తిరుగువలసలు, క్రితం సంవత్సరంకన్నా తక్కువయాయి. అంతర్ రాష్ట్ర సరుకు రవాణా, సజావుగా సాగుతోంది. మొత్తం మీద, కార్యకలాపాలలో మందకొడితనం తాత్కాలికమనీ, 2021-22 మొదటి త్రైమాసికానికి పరిమితమవుతుందని అంచనా.

55. 2020-21 సంవత్సరంలో వలెనే, ఈ సంవత్సరంకూడా, వ్యవసాయం ఆశాజనకంగా ఉంటుందని అభిప్రాయం. వర్షపాతం ఇంకా విస్తారంగా, అధికంగా కలుగుతుందన్న అంచనాలు, దీనికి శుభసూచకం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ప్రత్యేకించి భారత దేశం ఎగుమతులు చేస్తున్న దేశాలలో, బలం పుంజుకొంటున్న కారణంగా, ఇటీవలి నెలల్లో ఎగుమతులు నిలకడగానే ఉన్నాయి. ఈ సంవత్సరంలో, నికర ఎగుమతులు, ఆర్థికాభివృద్ధికి కీలకమౌతాయని ఆశ. ఎగుమతులకు మద్దతునిచ్చే, విధానాలు ఈ ప్రక్రియకు మరింత ఊతాన్నిస్తాయి. కేంద్ర ప్రభుత్వం 2021-22 లో భారీగా పెంచిన మూలధన వ్యయం (క్యాపెక్స్) (వ్యయంలో పెరుగుదల 30.5 శాతం, దీనిలో క్యాపిటల్ ఔట్ లే 63.4 శాతం) మరియు ఇన్ఫ్రా స్ట్రక్చర్ పైప్ లైన్, నిబంధనలు సడలించిన తరువాత, పెట్టుబడులను తిరిగి పురికొల్పుతాయి. టీకా ప్రక్రియ విస్తరింపుతో, ప్రత్యక్ష సంపర్కం అనివార్యమైన, రంగాలు బలోపేతమౌతాయి. రిజర్వ్ బ్యాంక్ కల్పించిన నిరంతర ద్రవ్యత సౌకర్యంకూడా వారికి ప్రయోజనం కలిగిస్తుంది. దేశీయ విత్త మరియు ఆర్థిక పరిస్థితులు, సానునయంగానే కొనసాగుతాయని ఎమ్ పి సి నిర్దేశాలు ఆశ కలిగిస్తున్నాయి. పై అంశాలన్నీ పరిగణిస్తే, 2021-22, రెండవ త్రైమాసికం నుంచి, ఆర్థిక కార్యకలాపాలు పునరుద్ధరించబడి, 2021-22 రెండవ అర్థ సంవత్సరంలో (అక్టోబర్-మార్చి) వేగవంతమౌతాయని అనుకోవచ్చు. 2021-22 మొదటి త్రైమాసికంలో వృద్ధి కుంటుపడిన కారణంగా, 2021-22 పూర్తి సంవత్సరానికి వృద్ధిరేట్, ముందు అంచనా వేసిన 10.5 శాతం కాకుండా, 9.5 శాతం మాత్రమే ఉండవచ్చు.

56. గత రెండునెలలలో ద్రవ్యోల్బణం మేము ఊహించిన విధంగానే ఉంది. మార్చ్ లో 5.5 శాతం ఉన్న హెడ్ లైన్ ద్రవ్యోల్బణం, ఏప్రిల్ నెలలో 4.3 శాతానికి దిగింది. ముఖ్యంగా మూలాల ప్రభావం వల్ల, ఆహార / కోర్ ద్రవ్యోల్బణాలు తగ్గాయి. ద్రవ్యోల్బణం తగ్గితే, నీరసపడ్డ వ్యవస్థకు అవసరమైన ద్రవ్యత ద్వారా బలాన్నిచ్చి, ఎమ్ పి సి కోరుకొన్నట్లు, ఆర్థికాభివృద్ధి పునరుద్ధరించవచ్చు. గిరాకీ బలహీనంగా ఉన్న కారణంగా, పెరిగిన ముడి సరుకుల ధరల ప్రభావం, తయారీ మరియు సేవా రంగాలలో, కొంతమేరకే అమ్మకం ధరలలో కనిపిస్తుంది. 2021-22 సంవత్సరానికి అంచనావేసిన సి పి ఐ ద్రవ్యోల్బణం 5.1 శాతం, సహనపరిమితి 2-6 శాతం (టాలరెన్స్ బ్యాండ్) మధ్యలోనే ఉంది. అయితే, అనిశ్చితుల కారణంగా, దీనిలో మార్పులను సునిశితంగా పర్యవేక్షిస్తూ ఉండాలి. ఇటీవల ద్రవ్యోల్బణానికి, సరఫరా

ఇబ్బందులు కారణంగనుక, పెట్రోల్ మరియు డీజిల్; వంట నూనె, పప్పు ధాన్యాలు; మరియు ఇతర వస్తువుల సరఫరాలో గల సమస్యలు నివారించుటకు అవసరమైన చర్యలు సత్వరం చేపట్టాలి.

57. మొత్తం మీద, కోవిడ్-19, స్వల్పకాల అంచనాలను మార్చివేసింది. సాధారణ స్థితికి చేరుకోవడానికి, విత్త, ద్రవ్య మరియు వర్గ విధానాల మద్దతు ఆవశ్యకం. వైరస్ రెండవ దశ కారణంగా కలిగిన దుస్థితి నుండి ఆర్థికవ్యవస్థ తేరుకొని, అభివృద్ధి కొనసాగుటకు, ద్రవ్య విధాన చర్యల సహాయం తప్పనిసరి. అందువల్ల రెపోరేట్ అలాగే ఉంచాలని నేను వోట్ చేస్తున్నాను. అభివృద్ధి సాధించడానికి అనువుగా భవిష్య నిర్దేశాలు బలపరచాలి. ద్రవ్యోల్బణం లక్ష్యాన్ని మించకుండా జాగ్రత్త వహిస్తూ, ఆర్థిక వ్యవస్థపై కోవిడ్-19 ప్రభావాన్ని ఉపశమింపచేస్తూ, దీర్ఘకాల అభివృద్ధిని పునరుద్ధరించుటకొరకు, అవసరమయినంత కాలం, సానుకూల ధోరణితో వ్యవహరించాలన్న అంశానికి ప్రాధాన్యతనివ్వాలి. ఈసందర్భంగా 'పునరుద్ధరించుటకొరకు' అన్న పదం ఉపయోగించితీరాలి. దీనివల్ల, భవిష్య నిర్దేశాలు బలపరచి, ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించి, అభివృద్ధి బాటలో కొనసాగించుటకు ఎమ్ పి సి కట్టుబడి ఉందని తెలుస్తుంది. నిజానికి, ఆర్థిక వ్యవస్థకు ఊపిరిపోసి, అభివృద్ధి బాటలో కొనసాగించుట, అభిలషణీయమైన విధానం. అయితే, ద్రవ్యోల్బణ పెరుగుదలగురించికూడా అప్రమత్తంగా ఉండాలి.

58. రాబోయే కాలంలో, టీకా ప్రక్రియ వేగవంతం చేయడం, కోవిడ్-19 రెండవ దశను శీఘ్రంగా అదుపుచేయడంమీద, ఆర్థిక అభివృద్ధి, ద్రవ్యోల్బణం ఆధారపడి ఉంటాయి. రెండవ దశలో కొన్ని రంగాలు తీవ్ర ప్రభావానికి లోనయ్యాయి. వీటిపై ఒత్తిడి తగ్గించే దిశగా, 'సిస్టమిక్ లిక్విడిటీ' కల్పించుటకు అవసరమయిన సాంప్రదాయిక, వినూత్న క్రియాశీలక చర్యలు, అమలుచేయుటకు, రిజర్వ్ బ్యాంక్ కట్టుబడి ఉంటుంది. ద్రవ్య విధానంలో ప్రకటించినట్లు, సానునయ వైఖరి పాటించుటకు, తగిన ద్రవ్యత, ఆర్థిక పరిస్థితులు కల్పించుటకొరకు, రిజర్వ్ బ్యాంక్, జి-ఎస్ ఏ పి లావాదేవీలు మాత్రమేగాక, ఇతర సాధారణ మార్కెట్ కార్యకలాపాలు నిర్వహిస్తుంది.

**(యోగేశ్ దయాల్)**
చీఫ్ జనరల్ మానేజర్

**పత్రికా ప్రకటన: 2021-2022/390**

1 గోయల్ A 2021. యూజింగ్ స్నోబాల్ ఎఫెక్ట్ ఇన్ ఇండియన్ పోస్ట్ కోవిడ్-19 పాత్స్ టు ఫిస్కల్ కన్సాలిడేషన్. IGIDR వర్కింగ్ పేపర్ No. WP-2021-016. http://www.igidr.ac.in/pdf/publication/WP-2021-016.pdf లో లభిస్తుంది.

© అన్ని హక్కులు రిజర్వ్ బ్యాంకుకి చెందుతాయి.